# ఎండ - వెన్నెల

వెర్రాకాళ్ళమీద కూర్చుని, ముందుకు వంగి, ఎడమ చేతిని గట్టుపైవుంచి కుడిచేతిని మోచేతివరకు మురికికాలువలో ముంచి తనఅదృష్టాన్ని వెతుక్కుంటున్న నర్సిగాడు ఉన్నట్టుండి పైకి లేచాడు. చేతికిదొరికిన వస్తువుని పరీక్షగా చూచాడు. రాళ్ళూడిన ముక్కుపుడకలాగా కనిపించిందది. అతనిలో ఆశ తొంగిచూచింది. ఆనాడెప్పుడో .... పోలమ్మ రాకతో తనలో తొలివలపు తొంగిచూసినప్పుడు తనప్రేమకు సాక్షిగా వుంటుందని మూడు వారాలపాటు ఆదాచేసిన రూకల్తో ముక్కుపుడకను తీసుకవెళ్తే కొండెక్కినంత సంబరపడిపోయిన పోలి ముఖం గుర్తుకొచ్చిందతనికి.

బురద నిండివున్న ఆ ముక్కుపుడకను బురదనీటిలోనే పైపైన కడిగి కంటికి దగ్గరగా పెట్టుకుని చూశాడు,

'ఛత్. ఇత్తడిది' అంటూ దాన్ని బలంగా వెనకాలకు విసిరేడు. తనను వెంటాడుతున్న దురదృష్టంపై కోపం వచ్చింది.

కారు సడ్రున ఆగింది.

నర్సిగాడిచే విసరబడిన ఆ ముక్కపుడక టప్పున ఆగిన కారుమీాద పడింది.

నర్సిగాడు వెనక్కి తిరిగి చూసి తన తప్పు తెలుసుకున్నాడు.

కారులోంచి దిగిన వ్యక్తులు తనతప్పిదాన్ని గుర్తించ లేదని తెలుసుకొని 'అమ్మయ్యా' అంటూ కూర్చుండి పోయాడు. వచ్చిన వ్యక్తులిద్దరు షాపుల్లోకి నడుస్తుంటే వాళ్ళపైనుంచీ చూపుల్ని తిప్పుకోలేకపోయాడు నర్సిగాడు.

* * *

" శేర్ జీ ! "

" హాఁ సాబ్. ఓ రావుగారా ! నమస్తే. రండి ఇలాకూర్చోండి. కూర్చోండి మేడమ్!! రెండు ఐస్‌క్రీం పట్రా జల్దీ! .... ఫర్మాయియే-చాలారోజులకు తమదర్శనం కలిగింది." రాలీస్ ఫేన్ స్విచ్ వేశాడు శేర్ జీ.

రావుగారు, ఆయన సతీమణి తెల్లనిసిల్కు రుమాలతో నుదుట ఇంకా రూపు దాల్చని స్వేదబిందువుల్ని తుడుచు కున్నారు.

"ఈసంవత్సరం ఎండలు మనల్ని తినేస్తున్నాయండి."
"మనల్ని తినేయడంలో ఆశ్చర్యం లేదుసార్. ఈ ఎండ మూలంగా మేము బంగారాన్ని కరిగించే ఖర్చు సగం తగ్గిందంటే నమ్మండి" బోసిగా నవ్వబోయాడు శేర్.

" మీాషాపును ఎయిరుకండిషన్ ఎందుకు చేయించరు మీారు ? " రావుగారి సతీమణి వీణ మీాటింది.

" జరూరు చేయిస్తాం మేడమ్! ఈసారి మీరొచ్చే సరికి రెడీఅయిపోతుంది, సరైన ప్లాంట్ మార్కెట్‌లో లేదంటే .... పస్తాయించాను."

అంతలో రంగురంగుల ఐస్క్రీం కప్పులు తీయని వాసనల్ని పాపంతా నింపేశాయి.

రావుగారు, వారిసతీమణి తమముందుంచబడిన ఐస్క్రీం కప్పుల్ని వాసన చూచినట్లుగా రెండుసార్లు పైకి క్రిందకి కదిలించి వాటిని ప్రక్కకు నెట్టేరు.

వదలివేయబడిన ఆ కప్పులపై వాలబోయే ఈగల్ని ఎన్నోజతల కళ్ళచూపులు నిర్దాక్షిణ్యంగా తోలివేశాయి.

" శేర్ జీ, మీ బిజినెస్ ఎలావుంది ? "

రావుగారి ప్రశ్నను వింటూనే శేర్ జీ మొహం చిన్న బోయింది. ఏడుకొండల ఎత్తునుంచి పలుపులతో బలవంతాన లాగబడినట్లు దైన్యం ఆయన మొహం మీదకొచ్చి ఎక్కడ నిలవటానికీ చోటుదొరక్క శేర్ జీ పిప్పి పంటిమీదవాలింది, పక్కనున్న బంగారపు పంటిని వెక్కిరించినట్లు.

విచారాన్ని, దిగులును వ్యక్తంచేసేటప్పుడు శేర్ జీ పై పెదవి పైపైకి పోతుంది. అప్పుడతని ముందుపన్ను తళతళ మెరుస్తుంది. తెలిసిన వాళ్ళు మాత్రమే అప్పుడు శేర్ జీ మానసిక స్థితిని అర్థం చేసుకోగలరు.

' మా బిజినెస్ గురించి అడుగుతారా సార్ ! ఒకవైపు బంగారపు వ్యాపారంమీద ప్రభుత్వంవారి ఆజమాయిషి, మరోవైపు ఎవరి అజమాయిషి లేకసామాన్యుల అందుబాటు

వుండకుండా ఆకాశానికి ఎగిరిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు.... ఇలాంటి పరిస్థితులలో నగలు, నట్రా ఎవరికి కావాలి చెప్పండి....'

'అలాగని ప్రజలు ఏ వస్తువు కొనడం మానేశారు చెప్పండి....'

'నిజంచెప్పారు. ఏదీకొనకుండా మానలేదు. అంటే అర్థమేమిటి? ఇదివరకు రుపాయిపెట్టి నిత్యావసరవస్తువును కొనే వాళ్లు ఇప్పుడు నాలుగు రూపాయలుపెట్టి అంతేసరకు కొంటున్నారు. ఇక నగలేం చేయిస్తారు చెప్పండి.'

"వాటినిమాత్రం అవసరమున్నవాళ్లు మానేస్తున్నారా ఏమిటి?

"నిజం. నిజం ఏదోమీబోటి మహారాజులున్నారుగాబట్టి మేమీషాపులు పట్టుక వేలాడుతున్నాం. లేకపోతే అదుగో ఆబజారు పట్టుకుని ....ఒరోరోయి! నీకేమున్నా మతిపోయిందట్రా. నీఆశ బంగారంగాను—అయ్యగారు ఇవతల కూర్చొనుంటే మురిక్కాలవంతా కెలుకుతావేంరా! తర్వాత రా పో.పో.... చెప్పండిరావుగారు ఏం తీద్దామంటారు"?

"ఏమీ అక్కర్లేదండి. రెండు రవ్వల ఉంగరాలు ఒక్కసన్నజాజుల నెక్లసూ- రేపు పదింటికల్లా మాకందీయాలి"

"తప్పకుండా సార్! రహీం! రహీం"

కళ్ళముందు రవ్వల ఆశాకిరణం తళుక్కుమనగా ప్రక్క అంగడివేపు నడిచాడు నర్సిగాడు.

* * *

ఇక్కడికి అక్కడికి పదడుగుల దూరం. నర్సిగాడు నాలుగడుగులు వేసేసరికి అరికాళ్ళు బొబ్బలు పొక్కాయి. కారులో పోయేవాళ్ళ సౌకర్యంకోసం వేయించబడిన రోడ్డు పైన తారు ఎండకుకరిగి కాళ్ళకు అంటుకుని చుర్రుమంటోంది. ఎడలమూలంగా బంగారాన్ని కరిగించేఖర్చు సగంతగ్గిందన్న శేక్ జీ మాటలు గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు. "ఈళ్ళంతా బస్తీసినోళ్ళు. కాస్త ఎండకు తట్టుకోలేరు. ఎండల్లేకుండా వానలెట్టా కురుస్తాయి? వానలు లేకుండా పంట లేంపండుతాయి -అవీ ఇవీ లేనప్పుడు ధరలు ఆకాశానికంటక వూరుకుంటాయా!'

రోడ్డు దిగి మురికి కాలవ పక్కగా నడుస్తున్నాడు నర్సిగాడు.

పక్కకొట్టు దగ్గరకుపోతే అక్కడ ఎవరో రావుగారు లాంటివాళ్ళు కూర్చుని కనిపించారు. ఉద్యోగార్థియై తిరుగుతున్న నిరుద్యోగికి 'నో. వేకెన్సీ' బోర్డు కనిపించినట్లు అయింది నర్సిగాడికి.

నర్సిగాడు ఆగకుండా నడవటం మొదలెట్టాడు. అడుగులు వడివడిగా పడుతున్నాయి.

కాని ఎంతో దూరం నడవలేదు. నరనరాల్లోనూ తావు చేసుకున్న నీరసం దూరం దూరంగా అడుగుల్ని వేయనీయడంలేదు.

కడుపులో ఎండలాంటి మంట. అయినా నర్సిగాడు లెక్కచేయడు దాన్ని. నర్సిగాడేగాదు, వాడితండ్రి ఈరిగాడు

తాత అంకమ్మ, ముత్తాత.... ఆడిపేరేదో వుంది.... ఎవ్వరూ లెక్క చేయలేదు.

తాత, తండ్రుల్నాటి ఉద్యోగాన్నే చేపట్టిన నర్సిగాడు తాత తండ్రుల్లాగానే ఆకల్ని ఆనందముతో జీర్ణించుకోవటం అలవాటు చేసుకున్నాడు. కాని అవినీతి మాత్రి లెపుడూ మింగలేదు.

ఊనులో షావుకారు లందరికి తెలుసు—తనుఎటువంటి వాడో. ఫలానవాడి మనవడు, ఫలానవాడి కొడుకు అని కూడా తెలుసు.

అయితే ఆ తాత తండ్రిల్లాగా నర్సిగాడు బ్రితకలేక పోతున్నాడని అందరికీ తెలీదు. నర్సిగాడి తాత తండ్రులు తమ ఉద్యోగంలో బాగానే సంపాదించేవారు. వాళ్ళ కుటుంబాల్ని గడుపుకుని తమకంటె లేమి ననుభవిస్తున్న వాళ్లకి సహాయం చేసేవాళ్ళట.

ఒక్కొక్కరోజు ఒక్కొక్క బంగారపు కొట్టుదగ్గర కూర్చుని, ఆకొట్టుముందరి దుమ్మూధూళిని గుంటచాటల్తో తీసి, నీటితో కడిగి నిగ్గుతెలిస్తే వీసమెత్తు బంగారం కూడా తేలేదిట.

మురికికాలవల్లో మోచేతులవరకు చేతుల్ని పోనిచ్చి గాలిస్తే చిన్నాచితుకు దొరికి చిల్లర ఖర్చుల కొచ్చేదిట!!

మరి యిప్పుడో?

కొంతమంది షావుకార్లు కొట్టుముందు మట్టిని ముట్టు కుంటేనే కసిరి కొడ్తారు. ఈ నర్సిగాడికి బంగారు కణికలు దొరికి వీడు బాగుపడతాడని వాళ్లే భయం కాబోలు.

ఇప్పుడు మురికికాలువల్లో దొరికేది చిన్నా చితుకుగాడు మలేరియా, మశూచీ....

నర్సిగాడికి ఏడుపు ముంచుకొచ్చింది. పెద్దోడు-అదే పెద్దకొడుకు మశూచి వచ్చే పోయాడు. వాడిమీద తను ఎన్నో ఆశలు పెంచుకున్నాడు పదేళ్లపాటు. తాత, తండ్రు ల్నాటి ఉద్యోగాన్ని ఒగ్గేయలేక దాంతో బ్రతుకును లాగలేక సతమతమై పోతున్నాడు తను పెద్దోడ్ని ఈ ఉద్యోగంలో దింప కూడదంటే దింపకూడదనుకొని నిర్ణయించు కున్నాడు నర్సిగాడు. ఆరునూరయినా, నూరుఆరయినా ఆడ్ని చదివించాల, ఆడు పది రూపాయిలు సంపాదిస్తే చూచి ఆనందించాలి అనుకున్నాడు.

నర్సిగాడు ఆవిధంగా తీర్మానించుకున్న ఆర్నెల్లకే మహామ్మారి మశూచి పెద్దాడ్ని పొట్టన పెట్టుకుంది. ఆడి మీద అన్ని ఆశలు పెట్టుకోకుండా వుంటే బతికేవాడేమో అన్నది పోలమ్మ నాలుగైదుసార్లు. నిజమేనేమో ననిపించింది నర్సిగాడికి. అందుకే రెండోవాడు వీధిబడిలోకి పోతున్నా వాడిని గురించి ఏమీ ఆలోచించేవాడు కాదు.

" మూడో కాన్పుకి ఆడనలుసు పుడితే నట్టింట మాలచ్మి పుట్టిందంటారే పోలమ్మ " అని ఇరుగు పొరుగు ఇచ్చకాలాడుతుంటే తనకు అదృష్టం తిరుగుతుంది కాబోలని మురిశాడు, నర్సిగాడు. కాని, పుట్టినమూడు నెలలకే మాలచ్మిని మలేరియా మాయంచేసింది.

నర్సిగాడు వేదాంతిలా నవ్వుకున్నాడు—విధివిధాయ కాన్ని తల్చుకుని. అతని అదృష్టం తిరగలేదు, గాని తిరుగు

ముఖం పట్టింది. తిండి గింజలధరలు తెగపెరిగిపోయాయి. పొట్టగడవడం భారమై పోయింది. ఉన్నవాళ్ళ యిళ్ళల్లో పనీపాటా చేసి పోలమ్మ సంపాదించుకొచ్చే అన్నంమెతుకులు గిన్నెఅడుగునే అంటుకుంటున్నాయి, గొంతుదాకా రావటం లేదు. ఎడపిల్లా. పసిగుడ్డూ ఎదగటానికి తిండిలేక 'ఎండు వాతం'తో శుష్కించి పోతున్నారు. ప్రాణప్రదమైన తన సంతానం దుస్థితిని చూడలేక దిగులుతో చిక్కిశల్యమైన పోలమ్మ కళ్ళలో ప్రాణాల్ని నిలుపుకుని కాలంగడుపుతోంది....

నర్సిగాడికి అంగిలి ఎండినట్లు భావనకలిగింది. దరి దాపుల్లో ఎక్కడా మునిసిపాలిటీపంపు కనిపించలేదు.

అక్కడెక్కడో వరదలొచ్చి ఊరూనాడూ ఏకమై, ఉన్నదంతా ఊడ్చుకపోయిందట.

ఇంకెక్కడో గుక్కెడు నీళ్ళు దొరకక వేలకువేలు జనం ప్రాణాలొదిలారట.

ఇంకెక్కడో మరెవరో మంచినీళ్ళనుకుని మరి దేన్నో తాగి కన్నుమూశారుట!

ఎక్కడిదాకానో ఎందుకు, ఇక్కడ....మురికిపేటల్లో గతేమిటి? తినడానికి తిండిలేని తెగ కంతటికీ తాగడానికి నీళ్ళుకూడా కరువై ఎన్ని అగచాట్లుపడ్డారు? ఆలస్యంగానైనా మునిసిపాలిటీవ్యాను మంచినీరనే నీటిని సరఫరాచేస్తుంటే తనవంతు కుండెడునీళ్ళకోసం గుమిగూడిన జనంతో కలియ బడి పోలమ్మ కాలు విరగ్గొట్టుకోలా? సదరు మునిసిపాలిటీ వ్యానుకిర్రింద పొరపాటున చెయిర్మన్‌గారి కుక్క కాలుపడి

నలిగితే అందుకు సంతాపసూచకంగా ఆవ్యాను ఆరోగ్రిజులు గైరుహాజరైతే మురికిపేటల్లోనుంచి పైకెగసిన ఆర్తనాదాలూ హాహాకారాలూ ఎవరు విన్నారు?

అయిపోయిందాన్ని గురించి ఆలోచించడమంటే అదొక ఆనందం అతగాడికి.

ఆ ఆనందపుటుత్సాహంతో అల్లంత దూరంలో కనబడే మునిసిపాల్టీ పంపువైపుకు వేగంగా అడుగులు వేశాడు.

"అబ్బా"

నర్సిగాడు కూలబడిపోయాడు. రెండుచేతుల్తోనూ ఎడమకాలు పాదాన్ని పట్టుకొని అరికాల్లోకి చూశాడు.

ఏనాటి అనుబంధమో!

నల్లని నిడుపాటి ఇనుపమేకు!

శక్తి ఉన్నంతవరకూ లోపలికిపోయి కూర్చుంది. నీరసంనిండిన నరాలైనా జివ్వున బాధను సృష్టించగలిగేయి. గొంతులో తడారిపోయినా కళ్లల్లో నీళ్ళు సుళ్లుతిరిగేయి. పైన ఎండ, క్రింద నేల మంటల్ని ఎగదోస్తున్నది.

ఎంతో దూరం నడవాల్సిన తనగమ్యం, ఎంతో శ్రమ పడాల్సిన తన వుద్యోగం, శ్రమఫలితంతో తను యింటికి తీసుకుపోవలసిన నిత్యావసరాలూ, వాటికోసం ఎదురుచూసే నాలుగుజతలకళ్ళూ అతని కళ్ళముందు గిర్రున తిరుగుతుంటే నర్సిగాడు కళ్ళుతిరిగి పడిపోయాడు.

* * *

మర్నాడు అదే సమయానికి మురికిపేటలోని తాటాకుల నిట్టాడి కొంపలో, ఐస్‌క్రీం కప్పులకంటె కొంచెంపెద్దదైన మట్టి పాత్రలో ఐస్‌క్రీంలాంటి - అంతకంటే పల్చని- గంజతో గొంతు తడుపుకుని స్పృహలోకొచ్చిన నర్సిగాడు కళ్లు తెరిచాడు.

" పోలీ, నేను మళ్ళీ బ్రతికినానా "

పోలమ్మ కంటతడి పెట్టింది. " మమ్మల్నందర్ని ఈ నరకాన వదిలేసి సొరగానికెల్దా మనుకున్నావా " అంటూ వాపోయింది.

నర్సిగాడు ఉస్సురన్నాడు. పోలమ్మ గొంతువినలేక పోయాడు. ఎదగని బిడ్డను, పాకని పసిగుడ్డుని చూడలేక పోయాడు. అటువైపు వొత్తిగిలి కన్ను మూసుకున్నాడు.

అదేదో లోకం. అక్కడ హాయిగా వుంద. ఎండకూడా వెన్నెల్లావుంది. అడగందే తనకు ఐస్‌క్రీం కప్పులందిస్తున్నారు. అందమైన మెత్తని కార్లో తనను కూర్చోబెట్టేరు. ఆ కార్లో నాలుగు మూలల్నించి నాలుగు చిన్నఫ్యాన్లు రాలీసు ఫేనంతందంగా గాలిని సరఫరా చేస్తున్నాయి. ఆకలి, దాహం, అడియాస, నిరాశ అక్కడలేవు-అదేనేమో సొర్గమంటే.

" ఇక్కడజూడు పోలీ ఎంతహాయిగా వుందో" ఆనం దాన్ని అర్థాంగితో అనుభవిద్దామని యిటు తిరిగిన నర్సిగాడికి మామూలు లోకమే కనిపించింది.

"ఎవరో పిలుస్తున్నారు." పోలమ్మ అంది.

"నన్నెవరు పిలుస్తారే. ఇంత పెద్దమడిసి కోసం ఎవరొస్తారహె. వస్తే వచ్చారు. కారుతెమ్మను"

అదేదో లోకపు అనుభూతిని చెదరగొట్తున్న కాలి బాధను తిట్టుకుని పాదాన్ని రెండుచేతుల్తో నొక్కిపట్టుకొంటూ అన్నాడు నర్సిగాడు.

"నర్సిగా, ఒరోరే నర్సిగా !" బయటినుంచి పిలుపు.

నర్సిగాడు అదిరిపడ్డాడు. ఏం కొంప మునుగుతుందో నని భయపడ్డాడు. ఇదివరకోసారి డైమండ్ కొట్లో నగ పోయిందని, తనుగాని తీశాడేమో సోదా చేయిద్దామని వచ్చాడు షాహుకారు. ఆ పాడుబుద్ధులు తనకులేవని ఎరగడు కామోసు. భయంతోనే పడుతూ లేస్తూ బయటికొచ్చాడు నర్సిగాడు.

"ఆఁ" అంటూ నోరుతెరచి నిల్చుండిపోయాడు శేఠ్ జీని, వారి ప్రక్కనే రావుగార్ని చూసి.

అక్కడికి పదిగజాల దూరంలో చక్కని అందమైన కారు, అందులో రావుగారి సతీమణి.

"త్వరగా రారా, నీతో పెద్దపనితగిలింది, రావుగారు ఓ పావలాడబ్బులు యిస్తార్లే."

"ఏంటిబాబూ !" చేతులు కట్టుకున్నాడు నర్సిగాడు.

"ముందు కారెక్కు"

"మన్నించండి బాబూ ! నేనేం తప్పుచేశాను ? నేను కారెక్కడమేంటి ?"

"ఒరోరేయ్, చెప్పినమాట వినరా" అంతటి శేఠ్ జీ

నర్సిగాణ్ణి రెక్క బట్టుకుని ఈడ్చుక వెళ్ళి డ్రైవరుపక్కన కూలబడేశాడు.

కారు దూసుకపోతుంటే- కారు వాసనకు డోకొచ్చినంత పనైంది నర్సిగాడికి,

"దిగరా, దిగు."

"ఇదుగో, ఇక్కడ, ఇక్కడే పడింది. సరిగ్గా అరగంటైంది."

"ఏమిటది" నర్సిగాడు ఆదుర్దాగా అడిగేడు.

"రవ్వలఉంగరాల ప్యాకెట్టు. వెతకరా, చూస్తూ నిలబడతావేం" శేఠ్ జీ గదిమేడు.

అప్పటి కర్థమైంది నర్సిగాడికి, తనను తీసుకొచ్చిన కారణం.

కాలు జివ్వున లాగుతోంది. ప్రాణం తేలిపోతోంది. కాని విధి నిర్వహణ. ఆ ఉద్యోగంలో తనను మించినవాడు లేడు.

కాలువలో చెయ్యిపెట్టి నీటివేగాన్ని చూశాడు 'అరగంట' అని గొణుక్కొంటూ దాదాపు వందగజాలదూరం కాలువ దిగువకు పరుగెత్తాడు. కాలిబాధనుకూడా లెక్క చేయకుండా.

"అరెరె! ఉంగరాలు తీసుకుని పరుగెత్తుతున్నాడండి" రావుగారు రాగాలు తీశాడు.

శేఠ్ జీ తొణకలేదు. "గాభరాపడకండిరావుగారూ? ఉంగరాలు ఇంకా దొరకలేదు."

నర్సిగాడు పందగజాలదూరం పరుగెత్తి అక్కడ కాలువలోకి దిగి నీటి కెదురుగా వెతుకుతూ నడవటం మొదలెట్టాడు.

నర్సిగాడిలో అనేకమైన ఆలోచనలు– రవ్వల ఉంగరాలు, వాటిఖరీదు– వాటిని తను సొంతంచేసుకుంటే? తనకు దొరకలేదని బొంకితే? తన కిక అదృష్టం తిరుగుతుంది. కొన్నాళ్ళపాటు తిండికి వెతుక్కోనక్కరలేదు. ఎడది, పసివాడు దొరపిల్లల్లా తయారవుతారు. పోలికి మంచి చీర కొనొచ్చు. తనకోసం ఏదైనా తెచ్చినప్పుడు పోలి సంబరం చూసితీరాలి....

నర్సిగాడి ఆలోచనలు ఆగలేదు.

నర్సిగాడు ఆగిపోయాడు.

"బాబుగారూ! ఇదిగో దొరికింది" కాలువలోనుంచి బయటికి గెంతేడు,

రావుగారూ, శేక్‌జీ నర్సిగాడ్ని చుట్టుముట్టేరు. నర్సిగాడు చేతిలోని పొట్లాన్ని పంపుదగ్గరకు తీసుకెళ్ళి దాన్ని శుభ్రింగా కడిగి పై కాగితం తీసి, లోపలి రెండుఉంగరాల్ని శేక్‌జీ చేతిలో పెట్టేడు గర్వంగా.

శేక్‌జీ వాటిని రావుగారి చేతిలో పెడ్తూ "చూశారా రావుగారూ! ఏపనికి తగినవాడు ఆపనికి ఉండాలి. నర్సిగాడంటే ఏమనుకున్నారు? పాపం, వాడికో పావలా పడేయండి" అన్నాడు.

రావుగారు అర్ధరూపాయ కాసును నర్సిగాడి మీదకు గిరాటేశాడు. గిరాటేసి కార్లోకూర్చుని సతీమణితో సంతోషంగా కబుర్లుచెపుతూ వెళ్ళిపోయారు.

పదినిముషాలక్రింద తన మనసులో మెదిలిన ఆలోచనల్నీ, చివరకు తాను జేసిన పనినీ, మార్చిమార్చి వితర్కించుకుంటూ ఈనాటి తన ఆర్జనగా చేతిలో నిల్చిన అర్ధరూపాయి నాణేన్ని చూస్తూ నిల్చున్నాడు నర్సిగాడు.

“పరువుదక్కించావురా, ఇప్పుడీ ఉంగరాలుదొరక్కపోతే రావుగారి సతీమణిగారి ప్రయాణం ఆగిపోయేది. ఇంద. ఈ ఐదూ ఉంచుకో.”

రావుగార్ని పావలా యివ్వమని, తాను ఐదురూపాయలిస్తున్న శేర్ జీని అర్థం చేసుకోవడానికి చాలాసేపు పట్టింది నర్సిగాడికి. *